# గేదె



అప్పలకొండ అప్పుడే కొన్న గేదెను మురిపెంగా చూసుకున్నాడు. దానికిచిక్కటి కుడితి పెడుతూ—

అప్పుడే పేపరు పట్టుకొని పరుగెత్తుకొచ్చాడు కొడుకు రాంబాబు.

"నాన్నా నేను టెన్తు క్లాస్ పాసయ్యాను సంతోషంగా చెప్పాడు. మంచిదిరా. మనింటికి కొత్త గేదొచ్చిన ముహూర్తం మంచిది. శుభం జరిగింది— నీ ఇష్టం ఎంత వరకేనా చదివిస్తాను అన్నాడు అప్పలకొండ.

"నేను బాగా చదువుకుంటాను నాన్నా" కుడితి పెడుతున్న తండ్రి మెడచుట్టూ చేతులు వేసి అన్నాడు రాంబాబు.

'అలాగేరా' కుడితి తొట్టి దగ్గర్నించి లేస్తూ అన్నాడు.

రెండు నెలలు గడిచాయి.

రాంబాబుకి ఆ ఊళ్లోనే ఇంటర్‌లో సీటు వచ్చింది.

కొడుకుని బాగా చదివిద్దామనుకున్నాడు కాబట్టి వెంటనే ఇంటర్‌లో జాయిన్ చేశాడు.

ఫీజులకీ, పుస్తకాలకీ అయిన డబ్బంతా కొత్త గేదె పాలమ్మి కట్టాడు.

* *** *

మూడేళ్ళు కాలచక్రంలో తిరిగాయి.

రాంబాబు మంచి అందగాడుగా తయారయ్యాడు. దూడకు మరో దూడ పుట్టుకొచ్చింది.

ఒక్కగానొక్క తల్లిలేని కొడుకు కాబట్టి కొడుకు సరదాలని ఏనాడూ కాదనలేదు అప్పలకొండ.

విపరీతంగా చదువుకోసం ఖర్చయినా పట్టించుకోలేదు.

ఇప్పుడు అప్పలకొండ పరిస్థితి మరింత బాగుంది.

పెంకుటిల్లు స్థానంలో ఓ డాబా ఇల్లు తయారయ్యింది. పెరటి చుట్టూ ప్రహరీ కట్టాడు. గేదెలకి రేకుల శాల వేయించాడు.

* *** *

"నాన్నా నాకు విశాఖపట్నంలో యూనివర్శిటీలో సీటు వచ్చింది నాన్నా! నేను ఎమ్ఏ కూడా చదువుతాను." పోస్టుమేన్ ఇచ్చిన కవరు చూసి సంతోషంగా అన్నాడు రాంబాబు.

కొడుకు సంతోషమే తన సంతోషం.

కాదనలేకపోయాడు.

"నీ ఇష్టం.. అలాగే కానీ" గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు.

అంతే—

ఎమ్ఏలో జాయిన్ అయ్యాడు రాంబాబు.

* *** *

రాంబాబు పేపర్లు రోజూ చూడసాగాడు.

రకరకాల పోస్టులకు అప్లయ్ చేయసాగాడు.

ఎన్నో రిటెన్ టెస్టులకు అటెండ్ అవసాగాడు.

ఎన్నో ఇంటర్వ్యూలకు తిరగసాగాడు.

* *** *

కాలచక్రంలో ఐదేళ్లు గిర్రునతిరిగాయి.

పెరటిలో గేదెల సంఖ్య పెరిగింది.

పాలవాడకందార్ల సంఖ్య పెరిగింది.

రాబడి పెరిగింది.

కానీ—

వచ్చిన రాబడంతా కొడుకు ఇంటర్వ్యూలకీ, రిటెన్ టెస్టులకీ, అప్లికేషన్స్‌కీ, రిజిస్ట్రేషన్ ఫీజులకీ ఖర్చయిపోతుండడంతో చదువుకున్నప్పుడున్నంత ఉత్సాహంలేదు అప్పలకొండకి.

చెప్పులరిగేలా తిరిగినా ఉద్యోగం రావడం లేదు రాంబాబుకి.

క్రమేపీ నిరాశ నిస్పృహ ఆవరించాయి.

గెడ్డం పెంచుకుంటూ తిరగ సాగాడు.

కొడుకుపై కోపం పెరగసాగింది అప్పలకొండకి.

ఒకసారి కోపంగా అన్నాడు.

"బోలెడంత కుదువుపెట్టి నిన్ను ఎమ్ఏ వరకు చదివించాను. అయిదేళ్లుగా బోలెడంత డబ్బు ఈ తిరుగుళ్లకిస్తున్నాను. ఏదీ చిన్న గుమాస్తా ఉద్యోగమైనా సంపాదించావా?"

"నన్నేం చెయ్యమంటావ్? రిటెన్ టెస్టు పాసవుతున్నానా? ఇంటర్వ్యూలకు తిరుగుతున్నానా? నా ప్రయత్నం నేను బాగానే చేస్తున్నాను. అయినా ఉద్యోగం రావడంలేదు. వస్తే చేయాలని నాకు మాత్రం లేదా?" అంతే కోపంగా అన్నాడు రాంబాబు.

పురిజాల సుధాకర్

"నీకింక పిల్లని కూడా ఎవడూ ఇవ్వడ్రా. అప్పుడు పెళ్లి చేసుకోరా అంటే ఉద్యోగం రానీ అన్నావు. ఇప్పుడు ముప్పయి ఏళ్ల దాటాయా ఇంకేం పెళ్లి అవుతుందిరా?" విసుగ్గా అన్నాడు అప్పలకొండ.

"కాకపోతే పోనీ— నా స్వంత సంపాదనతో నా పెళ్లాన్ని పోషించాలి. అంతేకాని, నేనే నీకు భారంగావుండి, ఇంకొకర్తిని తెచ్చి నీకిబ్బంది పెట్టను"

నిజమే అనిపించింది అప్పలకొండకి.

అయినా తాతా అని పిలిపించుకునే వయసిది.

కానీ

అదృష్టం తనకి లేదు.

* *** *

మరో మూడేళ్లు గడిచాయి.

తండ్రీ కొడుకుల మధ్య కొట్లాటలు పెరిగాయి.

"నా వల్లకాదు. నేనింకా పైసా ఇవ్వను. ఇవ్వలేను. నీ వల్ల నా గేదెలన్నీ తరిగిపోయాయి. ఒక్కో ఇంటర్వ్యూకి హైదరాబాదు విజయవాడలు తిరిగినపుడు ఒక్కో గేదెని అమ్మేయవలసి వచ్చింది. రాబడి తగ్గింది. ఇంత వాడివయ్యావు. ఆలోచించు!"

"ఇదే ఆఖరి అవకాశం నాన్నా— ఇక ఉద్యోగం వయసు నాకూ దాటిపోతోంది. ఆ ముసలిగేదె నమ్మేసి ఇయ్యి నాన్నా" ప్రాధేయంగా అడిగాడు రాంబాబు.

"ఏమన్నావ్? ఆ గేదెనే అమ్మెయ్యాలా! నువ్వు పదో తరగతి పాసయినపుడు కొన్న గేదెరా అది. దానివల్లేరా నీ చదువు సాగింది. దాని దూడల్ని అమ్మేరా నిన్ను అన్ని ఊళ్లకి పంపింది. ఆ గేదె పాల నమ్మేరా ఇంత ఇల్లు కట్టింది. అలాంటిదీ దాన్ని అమ్మమంటావా? పోరా వెధవా? నువ్వూ వద్దు, నీ ఉద్యోగం వద్దు ఫో!" కోపంగా కసిరాడు అప్పలకొండ.

విసురుగా వెళ్లిపోయాడు రాంబాబు.

అప్పలకొండకి ముసలి గేదె కనిపించింది.

పదిహేడేళ్ల క్రితం కొన్న గేదె.

దాని దగ్గరకు వెళ్లాడు.

ఆప్యాయంగా దాని ఒళ్లు నిమిరాడు.

కుడితి గోలెం దగ్గరికి తీసుకెళ్లాడు.

కడుపునిండా కుడితి పెట్టాడు.

అప్పలకొండ కళ్లంట నీరు వచ్చింది. అప్పలకొండని అర్థం చేసుకుందా అన్నట్లు ఆ గేదెకూడా కన్నీరు విడవసాగింది.